సాక్షి అనకాపల్లి

మంగళవారం । 11 । జూన్ । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



జన జాతర 8లో

పాడేరు మోదకొండమ్మ జాతర రెండో రోజు సోమవారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి జనం భారీగా తరలివచ్చారు.

గరిష్టం/కనిష్టం 35.3/26.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు


నిఖిల్


కుషల్

నర్సీపట్నం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సుర్ల నిఖిల్ నందన్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 329 ర్యాంక్ సాధించాడు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) రోబోటిక్ రీసెర్చ్ చేయాలన్నది తన లక్ష్యమని నిఖిల్ పేర్కొన్నాడు. తండ్రి డాక్టర్ ఎస్.ఎన్. మల్లికార్జునరావు అక్షయ హాస్పిటల్స్ నిర్వహిస్తున్నారు. తల్లి నిర్మల తెలంగాణలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. కుమారుడు నిఖిల్ నందన్ ఉత్తమ ర్యాంక్ సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కుషల్‌కు 1345వ ర్యాంకు

యలమంచిలి రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో యలమంచిలి విద్యార్థి కట్టమూరి కుషల్ సత్తా చాటాడు. కోర్పుపేటకు చెందిన కుషల్ 360 మార్కులకు 222 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరీలో దేశస్థాయిలో 1345వ ర్యాంకు సాధించాడు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ చేస్తానని కుషల్ తెలిపాడు. విద్యార్థి తండ్రి రాజేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి కుమారి గృహిణి. మంచి ర్యాంకు సాధించిన కుషల్‌ను పలువురు అభినందించారు. తమ కుమారుడు ఈ స్థాయి ర్యాంకు సాధించడం గర్వంగా ఉందని కుషల్ తండ్రి రాజేష్ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి


కశింకోట పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలాజీ

కశింకోట : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఉత్తమ సేవలందించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం. బాలాజీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. కశింకోట పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద ప్రతి నెల గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వారికి ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు జరుగుతున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజీనామా

అల్లిపురం (విశాఖ): విశాఖ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని పాఠశాల విద్యాశాఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపినట్లు పేర్కొన్నారు. జగనన్న పోరాటం, ప్రజాభీష్టం మేరకు 2019లో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో 2024 జనవరి 12వ తేదీన గ్రంథాలయ శాఖ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. నాటి నుంచి గ్రంథాలయ శాఖ చైర్మన్‌గా తన బాధ్యతను అంతఃకరణ శుద్ధితో నిర్వర్తించానన్నారు. 2024 ఎన్నికల ఫలితాల్లో అనుమానాలు ఉన్నా ఆధారాలు లేనికారణంగా ఓటమికి బాధ్యత వహిస్తూ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని లేఖలో పేర్కొన్నారు.

పద్మ పురస్కారాలకు దరఖాస్తులు

విశాఖ స్పోర్ట్స్: పద్మ పురస్కారాల కోసం అంతర్జాతీయ క్రీడల్లో అత్యున్నత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ padmaawards.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొందవచ్చని పేర్కొంది. పూర్తి చేసిన దరఖాస్తులను sportsinap@gmail మెయిల్‌కు ఆగస్టు ఒకటో తేదీలోగా పంపించాలన్నారు. అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని తెలిపారు.

బస్సులో జీవీఎంసీ చేరుకున్న మేయర్

డాబాగార్డెన్స్ (విశాఖ):

వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టాలన్న ఆశయంతో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ సిటీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు.

మత్స్యకార భరోసా ఎప్పుడు?

- వేట నిషేధ భృతి కోసం గంగపుత్రుల ఎదురు చూపులు
- ఎన్నికల కోడ్ అడ్డురావడంతో ఆగిన చెల్లింపు
- రెండు నెలలుగా పస్తులతో మత్స్యకారులు
- పెంచిన పరిహారంతోపాటు చెల్లించాలని వినతి
- ఐదు రోజుల్లో ముగియనున్న వేట నిషేధం


వలలకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

నక్కపల్లి: వేట నిషేధం మరో ఐదు రోజుల్లో ముగియనుంది. గంగపుత్రులు సముద్రంపైకి వేటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గత నాలుగేళ్లుగా నిషేధ కాలంలోనే ఠంచనుగా అందుతున్న మత్స్యకార భరోసా ఈసారి ఎన్నికల కారణంగా ఆలస్యమైంది. ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు చేపల వేటకు నిషేధం విధించిన విషయం తెలిసిందే. నిషేధం గడువు ముగిసే లోపు ప్రభుత్వం మత్స్యకారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు రోజుల్లో ముగుస్తున్నా ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం ఇంకా అందలేదు. ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం కావడంతో మత్స్యకార కుటుంబాలు ఆకలితో అల్లాడుతున్నాయి. 2019 వరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రెండు నెలలకు రూ.4 వేలు మాత్రమే పరిహారంగా చెల్లించేవారు. ఈ పరిహారం ఏ మాత్రం సరిపోవడం లేదన్న విషయాన్ని గమనించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. చెప్పిన విధంగా 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నాలుగేళ్లపాటు నిషేధ సమయంలో ఇచ్చే పరిహారం మొత్తం రూ.10 వేలు మే నెలలోనే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నిషేధం కారణంగా మత్స్యకారులు 60 రోజులు ఉపాధి లేక పస్తులుంటారు. ఈ సమయంలో వీరంతా వలలు, బోట్లు, తెప్పలు రిపేరు చేసుకుంటూ జీవనం గడుపుతారు. వేరే పనులకు వెళ్లడం ఉండదు. ఉపాధి పనులు కూడా తీర ప్రాంతాల్లో పెద్దగా ఉండవు. దీంతో ఈ రెండు నెలల పాటు వీరు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు. జిల్లాలో 7 మండలాల్లో పరవాడ నుంచి పాయకరావుపేట మండలం వరకు 11,010 మంది లబ్ధిదారులు సుమారు 3500 బోట్లు తెప్పలపై వేట సాగిస్తుంటారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో వేట నిషేధం పక్కాగా అమల్లో ఉంటుంది. వేట సాగించేవారితోపాటు వేటాడి తెచ్చిన వారి నుంచి చేపలు కొని టోకుగా గ్రామాల్లో అమ్ముకుంటూ జీవిస్తున్న మత్స్యకారులు కూడా ఉంటారు. వీరికి మాత్రం మత్స్యకార భరోసా ఇవ్వడం లేదు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా నిషేధ భృతి చెల్లింపుల్లో ఆలస్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా చెల్లించే విధానానికి కూడా ఎన్నికల్ కోడ్ వర్తింపజేయడం భావ్యం కాదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముగిసి కోడ్ ఎత్తి వేయడంతో తమ కష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే వేట నిషేధ పరిహారం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని ప్రకటించారని, ఎలాగూ ఈ ఏడాది పరిహారం ఇంకా చెల్లించలేదు కాబట్టి పెంచిన పరిహారం రూ.20 వేల చొప్పున చెల్లించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తొలి ఏడాది నుంచే రూ.10 వేల వంతున పరిహారం చెల్లించారని, తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఈ ఏడాది నుంచే అమల్లోకి తీసుకురావాలని గంగపుత్రులు కోరుతున్నారు.

పస్తులుంటున్నాం



రెండు నెలల నుంచి వేట లేక పస్తులుంటున్నాం. ఎలచ్చన్ల పేరు సెప్పి డబ్బులు మా అకౌంట్లో వేయనేదు. పెతీ ఏటా ఇచ్చే డబ్బులకి ఎలచ్చన్లకి ఏం సంబంధమో తెనీడం లేదు. మరో ఐదు రోజుల్లో మళ్లీ ఏటకి ఎల్లాలి. జగన్ పెబుత్వంలో మే నెలలోనే డబ్బులు ఏసీవోరు. ఈ సంవత్సరం ఇంకా పడనేదు. సెంద్రబాబు ఇరవై ఏలు ఇత్తానన్నాడు. గెలిసేడు కాబట్టి ఈ నెల నుంచే ఇత్తాడేమోనని మా ఓళ్లంతా ఆశ పడుతున్నారు. మా డబ్బులు మాకు తొందరగా ఏయాలి.

–యజ్జల అప్పలరాజు, మత్స్యకారుడు

త్వరలో జమ అవుతుంది

అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. పరిహారం సొమ్ము నేరుగా వారి ఖాతాల్లోనే జమ అవుతుంది. సార్వత్రిక ఎన్నికల కారణంగా పరిహారం చెల్లింపుల్లో ఆలస్యమయింది. త్వరలోనే పరిహారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది.

– శృతి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి

గ'ఘన' యానం!

- హైదరాబాద్‌కు ప్రయాణాలు అధికం
- వైజాగ్ నుంచి గత రెండు నెలల్లో 64 వేల మంది పయనం
- 50 వేల మందితో రెండో స్థానంలో బెంగళూరు
- 95 శాతం ఆక్యుపెన్సీతో కౌలాలంపూర్ అగ్రస్థానం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ, విదేశాల్లోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించే వారి సంఖ్య రానురాను పెరుగుతోంది. అదే సమయంలో సీట్ల సామర్థ్యంలో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) కూడా ఊపందుకుంటోంది. గత రెండు నెలల్లో ప్రయాణికుల సంఖ్య, ఓఆర్‌ను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఏప్రిల్ కంటే మే నెలలో మరింత మంది ప్రయాణికులు పెరిగారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణేలకు దేశీయ సర్వీసులు, సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు విదేశీ సర్వీసులు నడుస్తున్నాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఏసియా, స్కూట్ విమానయాన సంస్థలు వీటిని నడుపుతున్నాయి. వీటిలో విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ మంది ప్రయాణించారు. ఏప్రిల్‌లో 29,862 మంది, మే నెలలో 34,066 మంది వెరసి 63,928 మంది (81 శాతం ఓఆర్) వెళ్లారు. ఆ తర్వాత బెంగళూరుకు 50,755 మంది (83 శాతం) పయనించారు. అలాగే ఢిల్లీకి 39,151 (83 శాతం) మంది, చెన్నైకి 23,419 (75 శాతం) మంది, ముంబైకి 18,283 (87 శాతం) మంది, కోల్‌కతాకు 10,133 (80 శాతం) మంది, పూణేకు 3,808 (73 శాతం) మంది ప్రయాణం చేశారు. ఇక విదేశీ విమానాల విషయానికొస్తే సింగపూర్‌కు అధిక సంఖ్యలో 5,741 (91 శాతం) మంది, బ్యాంకాక్‌కు 3,303 (79 శాతం) మంది, కౌలాలంపూర్‌కు 2,659 మంది ప్రయాణించారు. అత్యధికంగా కౌలాలంపూర్‌కు 95 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉంది. కౌలాలంపూర్‌కు ఏప్రిల్‌లో 353 మంది వెళ్లగా మే నెలలో 2,306 మంది పయనించారు.

తాకిడిని పెంచిన వేసవి

సమ్మర్ సీజన్ కావడంతో విద్యార్థులతో పాటు మరికొంత మంది ఉద్యోగులు వివిధ ప్రాంతాల పర్యటనలకు వెళ్తుంటారు. ఏప్రిల్ మూడో వారం వరకు పాఠశాలలు నడిచాయి. దీంతో విశాఖ నుంచి మే నెలలో విహార యాత్రకు పెద్ద సంఖ్యలో విమానాల్లో ప్రయాణించడం వల్ల గగన యానంలో రద్దీ పెరగడానికి కారణమైంది.

ఏప్రిల్, మే నెలల్లో విశాఖ నుంచి విమాన ప్రయాణికుల వివరాలు

	ఏప్రిల్ 2024		మే 2024	
సెక్టార్	ప్రయాణికులు	ఓఆర్ శాతం	ప్రయాణికులు	ఓఆర్ శాతం
హైదరాబాద్	29,862	80.58	34,966	81.43
బెంగళూరు	24,507	82.46	26,248	88.25
చెన్నై	11,581	70.87	11,838	81.97
ఢిల్లీ	19,385	81.52	19,766	85.98
ముంబై	8,772	84.54	9,511	89.44
కోల్‌కతా	5,510	75.27	4,623	85.90
పూణే	1,798	69.69	2,010	77.91
సింగపూర్	2,763	90.29	2,978	91.91
బ్యాంకాక్	1,433	79.61	1,870	79.91
కౌలాలంపూర్	353	98.06	2,306	91.51

జాతీయ వర్క్‌షాపులో మన బెల్లం పరిశోధనలు


లక్నోలో బెల్లం పరిశ్రమపై జరిగిన జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఏడీఆర్ జగన్నాథరావు

- నూతన విధానాలకు ఫిదా అయిన శాస్త్రవేత్తలు
- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం, పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో బెల్లం పరిశోధనలపై లక్నోలో జరిగిన జాతీయస్థాయి వర్క్‌షాపులో మన పరిశోధనల గురించి వివరించినట్లు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో జరిగిన వర్క్‌షాపు విశేషాలు వివరించారు. అనకాపల్లి శాస్త్రవేత్తలు బెల్లాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసే టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారని, బెల్లం పొడిని తయారు చేసే విధానం, నాలుగు రోలర్ల చెరకు రసం తీసే యంత్రాలు, మూడు పెనాల పొయ్యిలను అందించారని.. ఈ విషయాలను వర్క్‌షాపులో తాను వివరించినట్లు చెప్పారు. బెల్లం పొడి తయారీ యంత్రాలను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ప్రాచుర్యంలోకి తీసుకురావాలని కోరినట్లు చెప్పారు. చెరకు రసం తీసే యంత్రాలను, చెరకు పిప్పితో పనిచేసే బయోమాస్ గ్యాస్ ఫైర్ యంత్రాలను, బెల్లంలో ఉన్న సల్ఫర్ డయాక్సైడ్ అనే కెమికల్ గుర్తించే పరికరాన్ని, తెట్టును తీసే పరికరం రూపొందించడానికి ప్రణాళికలను వర్క్‌షాప్‌లో రూపొందించినట్లు చెప్పారు. అయోధ్యలో రోజుకు సుమారు 20 మెట్రిక్ టన్నుల చెరకు పిప్పితో వివిధ రకాల ప్యాకింగ్ మెటీరియల్ తయారు చేసే కంపెనీ నడుస్తోందని, దీనిని పరిశీలించామని చెప్పారు. పర్యావరణ హితమైన వివిధ ప్యాకింగ్ మెటీరియల్స్‌ను ఈ పరిశ్రమ తయారు చేస్తుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో తనతోపాటు అనకాపల్లి శాస్త్రవేత్త శ్రీదేవి పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

రాజకీయాల నుంచి రిటైర్ అవుతున్నా..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

- అయినా కార్యకర్తలకు అండగా ఉంటా
- అలవి కాని హామీలతో కూటమి ప్రభుత్వంపై 6 నెలల్లో వ్యతిరేకత
- కార్యకర్తలు సంయమనం పాటించాలి
- మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం: ఓపిక ఉన్నంత వరకు ప్రజలకు సేవలందించానని, ఇకపై రాజకీయాల నుంచి రిటైర్ అవుతానని మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రకటించారు. సోమవారం అచ్యుతాపురం మండలం కొండకర్లలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వద్ద నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ ఓటమి, ఎన్నికల ఫలితాలపై ఆయన కార్యకర్తలతో చర్చించారు. పార్టీ బలోపేతంపై కార్యకర్తలు దృష్టి సారించాలని, గ్రామాల్లో కమిటీలు వేసుకొని మళ్లీ పార్టీ విజయానికి సైనికుల మాదిరి పనిచేయాలని అన్నారు. రాజకీయాల నుంచి విరమించినా కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించవచ్చన్నారు. ప్రస్తుతం కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని, కూటమి ప్రభుత్వంపై 6 నెలల్లో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. ఓట్ల కోసం కష్టసాధ్యమైన హామీలు ఇచ్చారని, అవే వారికి గుదిబండగా మారనున్నాయన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవిందు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, రాంబిల్లి ఎంపీపీ శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, మునగపాక ఎంపీపీ మల్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు కొర్రీలు

నగరంలోని లాసన్స్‌బే కాలనీలో గల రవీంద్ర భారతి స్కూల్లో ఉచిత విద్య కింద రెండు ఫేజ్‌ల్లో కలిపి ఎనిమిది మంది విద్యార్థులకు సీట్లు లభించాయి. కానీ పాఠశాల యాజమాన్యం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే స్కూల్ మూసివేశారు. ఇళ్లకు దగ్గరలోని ప్రైవేటు స్కూల్లో సీటు లభించిందన్న ఆనందం విద్యార్థుల తల్లిదండ్రులకు అంతలోనే మాయమైంది. మా పరిస్థితి ఏంటనే తీవ్ర ఆందోళనతో మండల విద్యాశాఖాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

విశాఖ వ్యాలీ, లిటిల్ ఏంజెల్స్, పొలాక్స్, శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌తో పాటు పలు స్కూళ్ల యాజమాన్యాలు ఎంతమందికి ఉచిత విద్య సీట్లు ఇచ్చామనే నివేదికలు కూడా అధికారులకు ఇవ్వటం లేదని తెలుస్తోంది. చర్యలకు సిఫార్సు చేసినా, జిల్లా స్థాయిలో సరైన స్పందన రావటం లేదని మదనపడుతున్న కొంతమంది ఎంఈవోలు, క్షేత్రస్థాయిలోని పరిస్థితులను లేఖ రూపంలో సమర్పించి మిన్నకుంటున్నారు.

- ఫ్రీ సీట్లు ఇచ్చేందుకు ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకుల నిరాసక్తత
- ఫ్రీ సీటు అయినా ఫీజు కట్టాల్సిందేనని ఒత్తిడి
- ఒప్పంద పత్రాలపై సంతకాలతోనే సీటు
- పేద విద్యార్థులకు కలగా మిగలనున్న ప్రైవేటు విద్య



విశాఖ విద్య : పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలోనూ ఉచిత విద్య అందించాలనే విద్యా హక్కు చట్టానికి విశాఖ జిల్లాలో తూట్లు పడుతున్నాయి. 'రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, ఉచిత సీట్లు పథకం కొనసాగిస్తారో.. లేదోననే' సాకుతో బడా స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకుండా తిప్పి పంపిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారులకు ఈ వ్యవహారం తీవ్ర తలనొప్పిగా మారింది. ప్రైవేటులో ఉచిత విద్య పథకంలో భాగంగా తొలి దశలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 3 వేలకు పైగానే సీట్లు పొందారు. వీరిలో ఎంతమంది చేరారనే లెక్కలు తీస్తున్నారు. తాజాగా రెండో విడతలో 3,257 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరందరికీ ఆయా పాఠశాలల్లో సోమవారం 5 గంటల్లోగా అడ్మిషన్లు ఇప్పించాలని విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయ భాస్కర్ మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

25 శాతం సీట్లు ఇవ్వాల్సిందే..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం అమల్లో భాగంగా ప్రైవేటు స్కూళ్లలోనూ పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేలా ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని ఆదేశించింది. జాతీయ విద్యా విధానాన్ని పకడ్బందీగా అమలు చేసే క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీన్ని రాష్ట్రంలో పకడ్బందీగా వర్తింపజేసింది. కానీ ప్రస్తుత పరిణామాలతో చక్కటి అవకాశాన్ని వినియోగించుకోలేకపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లకు కుంటిసాకులు

ఉచిత సీటు లభించినా, కొన్ని ప్రైవేటు యాజమాన్యాల వారు కుంటిసాకులతో అవాంతరాలు సృష్టిస్తూ, విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారు. . రెవెన్యూ కార్యాలయం నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం సమర్పించినా, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారి శాలరీ సర్టిఫికెట్లు సైతం తెస్తేనే సీటు ఇస్తామని తెగేసి చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

రెండో విడత సీట్లు పొందిన వారి వివరాలు

జిల్లా	అర్హత సాధించిన విద్యార్థులు	ప్రవేశం పొందిన వారు	చేరని వారు	ఇంకా చేరాల్సిన వారు
విశాఖపట్నం	2,185	1,198	607	380
అనకాపల్లి	1,068	822	246	-
అల్లూరి	4	2	1	1

సీటు ఇవ్వకుంటే గుర్తింపు రద్దు చేస్తాం



విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత సీటు పొందిన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాల్సిందే. దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయమని డీఈవోలకు ఆదేశాలిచ్చాం. మండలాల వారీగా ప్రోగ్రెస్ ఎలా ఉందనేది సమీక్షిస్తున్నాం. ఉచిత అడ్మిషన్లు ఇవ్వలేదని మా దృష్టికొస్తే, అలాంటి స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తాం.

– బి.విజయ భాస్కర్, ఆర్జేడీ, విశాఖపట్నం

పలు రైళ్ల దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం(విశాఖ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, ముస్తాబాద–గన్నవరం సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా, నిర్వహణా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. కింది రైళ్లు రెగ్యులర్ మార్గంలో కాకుండా ఆయా తేదీల్లో వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి.

- ఈనెల 10, 11, 17, 18, 24, 25వ తేదీల్లో ఎర్నాకుళం–పాట్నా (22643) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- ఈనెల 14, 21వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు–గౌహతి (12509) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- ఈనెల 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29వ తేదీల్లో ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి– భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్
- ఈనెల 11, 18, 25వ తేదీల్లో సికింద్రాబాద్–షాలిమార్ (12774) ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- ఈనెల 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30వ తేదీల్లో లింగంపల్లి– విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్‌ల నుంచి రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- సోమవారం సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్– అగర్తల(07030) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 6.05గంటలకు బయల్దేరింది.
- సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి – తాంబరం (22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ 4గంటలు ఆలస్యంగా సాయంత్రం 6గంటలకు బయల్దేరింది
- సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం – బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరింది.

క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం కళావేదికపై విశాఖపట్నానికి చెందిన మంజుశ్రీ నృత్యాలయం కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై కె.మంజుశ్రీ బృందం కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై ప్రదర్శిస్తున్న నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

16న స్విమ్మింగ్ జట్ల ఎంపిక



స్విమ్మింగ్ పూల్‌లో క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: సబ్ జూనియర్, జూనియర్ జిల్లా జట్ల ఎంపిక ఈనెల 16వ తేదీన బీచ్ రోడ్‌లోని అక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనుంది. గ్రూప్‌లో వన్‌లో 15 నుంచి 17 ఏళ్ల బాల బాలికలకు, గ్రూప్ 2లో 12 నుంచి 14 ఏళ్ల వారికి, గ్రూప్ 3లో 10 నుంచి 12 ఏళ్ల చిన్నారులకు జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో ఎంపికలు జరగనున్నాయి. ఫ్రీస్టయిల్, బాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై అంశాలతో పాటు మెడ్లీ అంశంలోనూ పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు. ఈనెల 12లోగా పేర్లను అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారు జూలై 13, 14వ తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



పాడేరులోని మోదకొండమ్మతల్లి



జాతరకు భారీగా తరలివచ్చిన జనం

అద్వితీయంగా జన జాతర

- మోదమ్మ జాతరకు రెండో రోజు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- డప్పు వాయిద్యాలు, శక్తి నృత్యాలతో సందడి

సాక్షి,పాడేరు: పోటెత్తిన భక్తుల సందడి.. ఘటాల ఊరేగింపు.. ప్రత్యేక వినోద కార్యక్రమాలతో పాడేరు కోలాహలంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లి జాతరకు రెండో రోజు జనం భారీగా తరలివచ్చారు. ఉమ్మడి విశాఖ,విజయనగరం జిల్లాలతో పాటు తెలంగాణ,ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు సోమవారం ఉదయం నుంచి మోదకొండమ్మతల్లి ఆలయంతో పాటు మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో పట్టణం కిక్కిరిసిపోయింది.రోడ్డు పక్కన వేసిన దుకాణాలతో పాటు, జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రాంగణం జనాలతో సందడిగా మారాయి.పాడేరు పట్టణమంతా ఉత్సవ శోభ నెలకొంది.

భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు

సతకంపట్టు వద్ద కొలువుదీర్చిన మోదమ్మ ఉత్సవ ఘటాలను సాయంత్రం పాడేరు వీధుల్లో ఊరేగించారు.ఉత్సవ ఘటాలను భక్తులు తమ శిరస్సు మీద పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.ఊరేగింపులో శక్తివేషాలు,గరగల నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.



పాడేరు పట్టణంలో ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



మోదమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జగదాంబ జంక్షన్‌కు 'క్లాక్'కళ



దాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్‌కు కొత్తకళ వచ్చింది. జంక్షన్‌లోని తెన్నేటి విగ్రహ పార్కులో నిర్మిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. రూ.2.80 కోట్ల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నారు. గతేడాది నవంబర్‌లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి భూమి పూజ చేశారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. 60 అడుగుల ఎత్తులో నిర్మించిన క్లాక్ టవర్ ఎంతో విశిష్టమైనది. నిర్మాణంలో భాగంగా క్లాక్ టవర్‌తో పాటు అందమైన ల్యాండ్ స్కేపింగ్‌తో కూడిన ఫౌంటేన్ ఏర్పాటు చేయనున్నారు. యల్లమ్మతోటగా పిలవబడే ఈ ప్రాంతంలో 1970లో 70 ఎంఎం స్క్రీన్‌తో అత్యంత ఆధునికంగా జగదాంబ థియేటర్‌ను నిర్మించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని జగదాంబ జంక్షన్‌గా పాపులర్ అయింది. క్లాక్ టవర్‌కు నాలుగు వైపులా అందమైన టైల్స్ అమర్చారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో నగర పరిధిలో 20 జంక్షన్లు, 16 రోడ్ల సుందరీకరణ పనుల్లో భాగంగా క్లాక్ టవర్ నిర్మాణం పూర్తి దాదాపు పూర్తయింది.



దాదాపు పూర్తయిన క్లాక్ టవర్ నిర్మాణం

వంట త్వరగా చేయమన్నందుకు వివాహిత ఆత్మహత్య



జ్యోతి మృతదేహం

అగనంపూడి: క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. తన తండ్రికి వేగంగా క్యారేజ్ తీసుకువెళ్లాలి..త్వరగా వంట చెయ్యి అని భర్త అన్నందుకు.. చాకిరీ అంతా నేనే చేయాలా అంటూ క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన దువ్వాడ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రం నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కణితిలో నివాసముంటున్న వ్యాన్ డ్రైవర్ వియ్యపు బాలాజీ గవర కంచరపాలెంకు చెందిన జ్యోతి (26)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాది పాప (యోక్షిత) కూడా ఉంది. అన్యోన్యంగా ఉంటారని చుట్టుపక్కలవాళ్లు కూడా చెబుతున్నారు. సోమవారం ఉదయం తన తండ్రికి క్యారేజ్ పట్టుకువెళ్లాలి వేగంగా వంట చేయాలని బాలాజీ జ్యోతిని కోరాడు. ఇంట్లో పనులన్నీ చేనే చేయాలా అంటూ జ్యోతి రుసరుసలాడుతూ చంటిపాపను కింద దించేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడయపెట్టి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలాజీ గట్టిగా కేకలు వేశాడు. చుట్టుపక్కలవాళ్లు పిలిచినా పలకపోవడంతో బాలాజీ తలుపు గెడను విరగ్గొట్టి లోపలికి వెళ్లి రక్షించే ప్రయత్నం చేశాడు. ముందుగా ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో అగనంపూడిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే జ్యోతి మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అబ్బురపరిచిన సాహితి జలాసనాలు

నర్సీపట్నం: స్థానిక రాయల్ రిసార్ట్స్ సిమ్మింగ్ పూల్‌లో ప్రముఖ స్విమ్మింగ్ క్రీడాకారిణి కలగర్ల సాహితి వివిధ రకాల జలాసనాలతో అబ్బురపరిచింది. సాహితి నీటిపై ఆసనాలు వేయడంలో పలు అవార్డులను అందుకుంది. ఈ ప్రాంత విద్యార్థులకు యోగాలో జలాసనాలపై అవగాహన కోసం నింజాస్, ఆర్వీ మార్షల్ ఆర్ట్స్, అర్జున్ స్కేటింగ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆమె పలు ఆసనాలను ప్రదర్శించారు.స్విమ్మింగ్ పూల్‌లో నీటిపై తేలియాడుతూ ఆమె వేసిన ఆసనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నింజాస్, ఆర్వీ మార్షల్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు తమ అభ్యర్థన మేరకు ప్రదర్శన ఇచ్చిన సాహితికి కృతజ్ఞతలు తెలిపారు. సాహితి సముద్రంలో కొట్టుకుపోతున్న ఇద్దరు చిన్నారులను కాపాడి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు. సాహితిని ఆదర్శంగా తీసుకుని నీటిపై యోగాసనాల్లో విద్యార్థులు రాణించాలని అభిలషించారు.





వివిధ అసనాలను ప్రదర్శించిన సాహితి

మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల రాజీనామా



కార్యదర్శి బంగార్రాజుకు రాజీనామా లేఖను అందిస్తున్న మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు, ఇతర డైరెక్టర్లు

మాడుగుల రూరల్: మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, మరో 15 మంది డైరెక్టర్లు తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యదర్శి ఎస్.బంగార్రాజుకు తమ రాజీనామా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కొండలరావు మీడియాతో మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 14న తనతోపాటు మరో 15 మందితో మాడుగులలో కొత్తగా మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారని, ఈ అవకాశం కల్పించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు ఆరు మాసాల పాటు ఈ పదవిలో కొనసాగినట్లు పేర్కొన్నారు. కమిటీ సారథ్యంలో ఎంతో అభివృద్ధి చేయాలని భావించామని, దురదృష్టవశాత్తూ వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ పదవులకు రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తమకు సహకరించిన మార్కెట్ కమిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సయ్యపురెడ్డి నారాయణ రావు, భీశెట్టి జగ్గప్పారావు, బసవ రామపరమేశ్వరావు, నూతిగట్టు గౌరీశంకర్, కొల్లి కృష్ణవేణి, శీరా సన్నెమ్మ, యడ్ల కళావతి పాల్గొన్నారు.

కశింకోట మార్కెట్ కమిటీకీ..



గొల్లవిల్లి శ్రీనివాసరావు

కశింకోట: స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు గుంటూరులోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు రాజీనామా లేఖను పంపారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు సుమారు 7 నెలల క్రితం మార్కెట్ కమిటీకి నామినేటెడ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి నేపథ్యంలో, ప్రజా తీర్పును గౌరవిస్తూ రాజీనామా చేసినట్లు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా ఆ లేఖలో పేర్కొన్నారు.

ఓపీ @1530

- రికార్డు స్థాయిలో రోగుల తాకిడి
- కిటకిటలాడిన కేజీహెచ్



కిటకిటలాడుతున్న కేజీహెచ్ ఓపీ టికెట్ కౌంటర్లు

మహారాణిపేట: కేజీహెచ్‌లో సోమవారం ఓపీ టికెట్ల కౌంటర్లు కిటకిటలాడాయి. సాధారణంగా మూడు నుంచి 5 ఓపీలు మాత్రమే పనిచేస్తాయి. సోమవారం మాత్రం ఎక్కువ మంది రోగులు రావడంతో 8 కౌంటర్లూ తెరిచి ఓపీ నమోదు నమోదు చేశారు. రూ.70 లక్షలతో ఓపీ కౌంటర్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధునికీకరించిన విషయం తెలిసిందే. గర్భిణులు, పిల్లలు, వృద్ధులకు ప్రత్యేకంగా మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. 8 కౌంటర్లు ఇతరుల కోసం నిర్మించారు. అలాగే కౌంటర్ల సంఖ్య కూడా పెంచారు. మొత్తం 8 కౌంటర్లు సోమవారం రద్దీగా ఉన్నాయి. ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రోగులు కేజీహెచ్‌కు వస్తుంటారు. కొత్తగా నిర్మించిన ఓపీ కౌంటర్లలో రోగులు, వారి సహాయకుల కోసం ఏసీ సదుపాయం కూడా కల్పించారు. సోమవారం అధిక సంఖ్యలో రోగులు కేజీహెచ్‌కు తరలివచ్చారు. ఓపీ టికెట్లు మాన్యువల్‌గాను, ఆన్‌లైన్ విధానంలో కూడా జారీ చేశారు. సోమవారం ఒక్క రోజు 1530 మంది ఓపీలో రిజిస్టర్ చేయించుకున్నారు.

పూరిల్లు దగ్ధం.. రూ.3 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన పూరిల్లు

గొలుగొండ: మండలంలోని చోద్యం గ్రామంలో సోమవారం పూరిల్లు దగ్ధం అయ్యింది. గ్రామానికి చెందిన బొచ్చా రాంబాబు ఇల్లు కాలిపోయింది. దీంతో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఇంటి వద్ద స్వీట్ల తయారీ సమయంలో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్తున్నారు. ఇంట్లో సామాగ్రి, వస్తువులు, నగదు, స్వీట్లు అన్నీ కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పాము కాటుతో యువకుడి మృతి



మృతుడు రమేష్ హతమార్చిన పాము

- పెళ్లైన మూడు నెలలకే భర్తను కోల్పోయిన భార్య




మృతుడు రమేష్ (ఫైల్)

నాతవరం: మండలంలోని సరుగుడు పంచాయతీ శివారు దద్దుగుల గ్రామానికి చెందిన గొల్లపల్లి రమేష్(28) పాము కాటుతో మరణించాడు. సంఘటనకు సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాలు. మృతుడు రమేష్ ఈ నెల 8న అత్తగారి ఊరు కాకినాడ జిల్లా రవతలపూడి మండలం సార్లలంక వెళ్లాడు. అక్కడ ఆ రోజు రాత్రి ఇంటి వద్దే రమేష్‌ను పాము కాటు వేసింది. కాటు వేసి వెళ్లిపోతున్న పామును చూసిన రమేష్ దాన్ని హతమార్చాడు. అనంతరం స్థానికంగా ప్రథమ చికిత్స తీసుకుని, మెరుగైన వైద్యం కోసం రవతలపూడి పీహెచ్‌సీలో చేరగా పరిస్థితి విషయమించింది. దీంతో అక్కడి నుంచి కాకినాడ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. రవతలపూడి పోలీసులు కేసు నమోదు చేసి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం స్వగ్రామం దద్దుగులో అంత్యక్రియలు నిర్వహించేందుకు రమేష్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు రమేష్‌కు వివాహం జరిగి 3 నెలలే అయింది. భార్య, కుటుంబీకుల రోదన గ్రామస్తుల్ని కన్నీళ్లు పెట్టించింది.

ఆలయం మహాద్భుతం

- మొగదారమ్మను చూసొద్దాం
- భారతీయ సంస్కృతికి అద్దంపట్టేలా నిర్మాణం
- సాగర్‌నగర్ సాగర తీరాన మరో ఆధ్యాత్మిక కేంద్రం



శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం



మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: బీచ్‌రోడ్డు అంటే నీలి కడలి సంద్రం, అందమైన ప్రకృతుల సమాహారం. పర్యాటక ప్రాంతంగా భాసిల్లుతున్న ఈ ప్రాంతం ఇప్పుడు ఆధ్యాత్మిక భావాలకు వేదికగా మారుతోంది. ఓ వైపు కలియుగ వైకుంఠదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, మరోవైపు శ్రీకృష్ణ భగవానుడు కొలువైన ఇస్కాన్ మందిరం... ఇదే వరుసలో సాగర్‌నగర్ సాగర తీరాన మరో ఆధ్యాత్మిక కేంద్రం కొలువైంది. విశాఖ ప్రజలను ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయం. ఆలయంలో మొగదారమ్మ మహాలక్ష్మితో పాటు శ్రీ దుర్గాదేవి, శ్రీ సరస్వతి అమ్మవార్లను కూడా దర్శించుకోవచ్చు.

ఎన్నో ప్రత్యేకతలు

ఈ ఆలయం ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. మహాలక్ష్మి గర్భగుడిలో చంద్రుడు పౌర్ణమి నుంచి అమావాస్యకు చెందే మార్పులను విశ్లేషిస్తూ,



నృత్యకళను ప్రతిబింబించే శిల్పకళ

అష్టలక్ష్ముల సమూహం, క్షీర సాగర మథనం, అష్ట దిక్పాలకులు, విశ్వాన్ని ప్రతిబింబించే రూపం, సహస్రదళపద్మాలను దర్శించే విధంగా నిర్మించారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, 12 రాశులు, 16 నృత్యకళలు, 12 పుష్కర దేవతలు రూపాలను అద్భుతంగా మలిచారు. దాంతో పాటు త్యాగరాజు స్వామి, వటపత్రసాయి, శ్రీకృష్ణ పరమాత్ముని వంటి రూపాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. ఇక్కడ శిల్పకళల్లో మలిచిన కాలుడు రూపంలో ఒక ప్రత్యేక ఉంది. ఓ కంటితో చూస్తే ఉగ్రరూపం, ఒక కంటితో చూస్తే శాంత స్వరూపంలో కనిపించే విధంగా చిత్రకారులు తీర్చిదిద్దారు. మరోవైపు కాలుడు చూసే విధంగా మలచిన శిల్ప కళాకృతి ఎంతో అత్యద్భుతం. ఇక్కడ దశావతారం, ఆదిశేషుడు ప్రత్యేక ఆకర్షణ. దుర్గాదేవి ఆలయంలో కూడా నవ దుర్గలు దర్శనమిచ్చే విధంగా శిల్పకళను అద్భుతంగా తీర్చిదిద్దారు. సప్తస్వరాల నమూనాలను ప్రతిబింబించేలా పక్షుల రూపాలను ఇక్కడ మలిచారు. నాటి సంస్కృతి సంప్రదాయాలు, కళలు, ఆచారాలు ఉట్టిపడేలా నిర్మించిన ఈ ఆలయం విశాఖ సాగర తీరాన ఓ అద్భుతమనే చెప్పాలి. అదే విధంగా ఇక్కడ ప్రతి శుక్రవారం, పౌర్ణమి, అమావాస్య, ఇతర పర్వదినాల్లో మహాలక్ష్మికి ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహిస్తారు. ఈ ఆలయం సందర్శించిన భక్తులు ఓ కొత్త అనుభూతిని పొందుతున్నారు. ఇక్కడకు వచ్చిన వారికి ఆధ్యాత్మిక భావాలే కాదు చరిత్రకు సాక్ష్యాలైన ఎన్నో విషయాలను తెలుసుకునే విధంగా ఆలయాన్ని నిర్మించారు.



ఆకట్టుకుంటున్న ఆలయ నిర్మాణం



భారత సంస్కృతి ఉట్టిపడే కళారూపాలు



ఆదిశేషుడు



వటపత్రశాయి శ్రీకృష్ణుని పలు రూపాలు

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన భరత్



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకుడు మలసాల భరత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. - కశింకోట

పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఉల్లిపాయ ధర పెరిగింది. కిలోకి రూ.10 మేర పెరిగింది. గత వారం కిలో రూ.30 ఉండగా.. ఈ వారం రూ.40కు ఎగబాకింది. టమాటా బెట్టు దిగలేదు. గత వారం మాదిరిగా రూ.60కు విక్రయాలు సాగాయి. బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కు పెరిగింది. బీట్రూట్, క్యారెట్, దొండకాయ, బీరకాయ, వంకాయ, బెండకాయ, గోరు చిక్కుడు రూ.60 చొప్పున విక్రయించారు. మామిడి పండ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. బంగినపల్లి, సువర్ణరేఖ రకం పెద్ద సైజు డజన్ రూ.300కు విక్రయించారు.

అలరించిన గీతాలు



విజేతలతో ఈశ్వరరావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పాటల పోటీలు ఆహూతులను అలరించాయి. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 40 మంది గాయకులు పాల్గొని, గీతాలు ఆలపించారని జీఆర్‌కే స్వరగమనం సంస్థ వ్యవస్థాపకుడు గేదెల ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భవిత స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు పాశ్చాత్య, జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. విజేతలకు ఈశ్వరరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు పెంటకోట లీలావతి, గాయకులు అజయ్, బాలకృష్ణ, గౌరీ, శ్రీనివాస్, రాము, శంకర్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	:సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
సత్యభామ	:వెంకటేశ్వర
వెపన్	:శ్రీసత్య
భజే వాయు వేగం	:రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 280 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,280	5,190
రెండో రకం	4,100	4,580
మూడోరకం	3,400	4,080

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

గొర్రెలు, మేకల అమ్మకాల జోరు

- తాళ్లపాలెం వారపు సంత కిటకిట
- రూ.30 లక్షల వరకు లావాదేవీలు
- ఆనందం వ్యక్తం చేసిన వ్యాపారులు



తాళ్లపాలెం సంతలో విక్రయానికి తీసుకొచ్చిన గొర్రెలు, మేకల మందలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం అమ్మకానికి మేకలు, గొర్రెలు భారీగా వచ్చాయి. ఎన్నికల కోడ్ ముగియడంతో గ్రామాల్లో ఉత్సవాలు, పండగలు ఘనంగా నిర్వహించుకునే అవకాశంతో మేకలు, గొర్రెల అమ్మకాలు జోరుగా సాగాయి. సాధారణంగా సంతకు వెయ్యిలోపు మాత్రమే అమ్మకానికి వస్తాయి. ఈ వారం ఆ సంఖ్య దాదాపు 1,500 వరకు ఉంది.

పొరుగు జిల్లాల నుంచి రాక

సంతకు జిల్లాతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ జిల్లాల నుంచి పెంపకందారులు, వ్యాపారులు అమ్మకానికి తీసుకొచ్చారు. వీటిని విశాఖ, గాజువాక, అనకాపల్లితోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, వ్యాపారులు, హోటళ్ల, ఉత్సవాల నిర్వాహకులు, మాంసం ప్రియులు తరలి వచ్చి ముమ్మరంగా కొనుగోలు చేశారు. పొట్టేళ్లు, ఆడ గొర్రెలు, మేకలు, మేకపోతులు, గొర్రెల మందలను కొనుక్కుని వ్యాన్లు, ఆటోల్లో తమ వెంట తరలించుకెళ్లారు. సుమారు రూ.30 లక్షల వరకు లావాదేవీలు సాగాయి. గొర్రె, మేకల పరిమాణం అనుసరించి రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలికింది. గత వారం కంటే రూ.2 వేల వరకు ధర ఎక్కువగా లభించినట్లు వ్యాపారులు, పెంపకందారులు ఆనందం వ్యక్తం చేశారు. సంతలో మేకలు, గొర్రెలు కొనుగోలుకు వ్యాన్లు, ఆటోలు కూడా ఎక్కువగా తరలి రావడంతో తాళ్లపాలెం-నర్సీపట్నం మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ సంగతి తెలియడంతో పోలీసులు వచ్చి రాకపోకలను క్రమబద్ధీకరించారు.



కొనుగోలు చేసిన మేకలను వ్యాన్లలో తరలిస్తున్న వ్యాపారులు



వారపు సంతలో మేకల విక్రయాలు

ధర బాగుంది



వారపు సంతలో గత వారం కంటె మేకలు, గొర్రెలకు ఎక్కువ ధర లభించింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో నిబంధనలు తొలగి గ్రామాల్లో ఉత్సవాలు, పండగలు మొదలవుతున్నాయి. దీంతో అధికంగా ఈ వారం మేకలు, గొర్రెలు అమ్మకానికి వచ్చాయి. వీటికి గిరాకీ ఏర్పడి ఈ వారం ఎక్కువ ధర లభించడంతో ఆనందంగా ఉంది.

– ఒమ్మి అచ్చిబాబు, గొర్రెలు, మేకల వ్యాపారి, సబ్బవరం

ఇదే జీవనాధారం



వేసవి ముగిసే వరకు మేకలు, గొర్రెల అమ్మకానికి గిరాకీ ఉంటుంది. వర్షాకాలం వస్తే డిమాండ్ తగ్గుతుంది. జిల్లాలో జరిగే సంతలకు వీటిని తీసుకెళ్లి విక్రయిస్తుంటాం. తక్కువ ధరకు కొని ఎక్కువ ధర వచ్చే సంతలో అమ్ముతుంటాం. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. సీజన్ కావడంతో అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నాయి.

– దేవర కన్నబాబు, వ్యాపారి, మాకవరపాలెం

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు



కేజే పురం పీహెచ్‌సీలో గర్భిణికి బీపీ చెక్ చేస్తున్న ఆశ కార్యకర్త



గర్భిణులకు ఆరోగ్య సూచనలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు

మాడుగుల రూరల్: కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 9న గర్భిణులకు వైద్య పరీక్షలు జరుపుతారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం కావడంతో, ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి వైద్య నిపుణులు ప్రియాంక 19 మంది గర్భిణులను పరీక్షించి, తగు సూచనలు, సలహాలు అందించారు. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారిణి సి.హెచ్. పుష్పమ్మ పర్యవేక్షణలో స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన మందులు అందించారు. కింతలి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేశారు.

కె.కోటపాడు: గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతులైన బిడ్డలు జన్మిస్తారని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా 34 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు జరిపి, మందులు అందించారు. అవసరం గల గర్భిణులకు స్కానింగ్ పరీక్షల కోసం కె.కోటపాడు సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు సూచించారు. ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఉండబోదన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులు నిండిన గ్రామాల్లో ప్రత్యామ్నాయ 'ఉపాధి'



సరుగుడు పంచాయతీలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



జె.పి.అగ్రహారంలో పంట భూమిలో కందకాల పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

రోలుగుంట: చెరువులు నిండిన గ్రామాల్లో ఉపాధి పథకం కింద ప్రత్యామ్నాయ పనులు కల్పిస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సూర్యమణి తెలిపారు. ఉపాధి పథకం ద్వారా మండలంలోని జేపీ అగ్రహారం, పదాలపాలెం, అర్ల తదితర గ్రామాల్లో జరుగుతున్న భూ అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. సాంకేతిక సహాయకులు రాము, దినేష్, అసిరయ్యలకు పలు సూచనలిచ్చారు. భూముల్లో నిర్దీత దూరంలో కందకాలను తవ్వించాలన్నారు. నీటి నిల్వలకు అనువుగా ఉండేలా గోతుల లోతు ఉండాలన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని గ్రామాల్లో చెరువులు నిండాయని, దీంతో చెరువు అభివృద్ధి పనులు చేయించలేమన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టామన్నారు. భూఅభివృద్ధి పనులు, పండ్ల తోటల్లో కందకాలు, కొండ ప్రాంతంలో నీటి నిల్వలుండేలా అవకాశాన్ని బట్టి చిన్నపాటి చెరువుల తవ్వకాల పనులు చేయిస్తున్నామన్నారు. కూలీలు, రైతు కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

గిరిజన భూముల్లో రాతిపేర్పు, ట్రెంచ్ పనులు

నాతవరం: ఉపాధి హామీ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో రాతి పేర్పు పనులు చురుగ్గా జరుతున్నాయని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. సోమవారం ఆయన సరుగుడు పంచాయతీలో ఉపాధి పనుల్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న గిరిజన రైతులు తమ భూముల్లో రాతిపేర్పు/ట్రెంచ్ పనులను అడుగుతున్నట్లు తెలిపారు. వారి అభీష్టం మేరకే ఆయా పనులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో పనులు చేసేందుకు అవకాశం లేకపోయిందదన్నారు. దీంతో రాతిపేర్పు, ట్రెంచ్ పనులతో పంట కాలువల్ని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

ఆన్‌లైన్‌లో వరి విత్తనాల నమోదు ప్రక్రియ

మునగపాక : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమయ్యే వరి విత్తనాల నమోదుకు ఆన్‌లైన్ సదుపాయం కల్పిస్తున్నట్లు మునగపాక వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు.ఎంటీయూ 1318 రకం 30 కిలోలకు రూ.894, ఎంటీయూ 1224 రకం 25 కిలోలకు గాను రూ.795, ఆర్‌జీఎల్ 2537 రకం 30 కిలోలకు రూ.954, ఆర్ఎస్ఆర్ 15048 రకం 25 కిలోలకు గాను రూ.795, బీపీటీ 5204 రకం 25 కిలోలకు గాను రూ.795,బీపీటీ 3291 రకం 30 కిలోలకు గాను రూ.834 వంతున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్‌కార్డు జెరాక్స్‌ను రైతు భరోసా కేంద్రం గాని లేకుంటే సచివాలయాల వద్దకు తీసుకురావడం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింధూజ కోరుతున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

తుమ్మపాల: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో తుమ్మపాలలోని పోలిపల్లెమ్మ వారి ఆలయం వద్ద ఈ నెల 12న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ వై.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగులను పరీక్షించి జాగ్రత్తలు, సూచనలు తెలుపుతారన్నారు. కంటి చూపు సమస్యలు ఉన్న గ్రామస్తులు, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 220 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గొర్లివానిపాలెం, పోర్టుకో, జాజులవానిపాలెం, పవర్ సిటీ, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి, సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

మాడుగుల సంతలో పనస పండ్లకు గిరాకీ



మాడుగుల వారపు సంతలో పనస పండ్లు

మాడుగుల: స్థానిక వారపు సంతలో పనస పండ్లకు సోమవారం గిరాకీ పెరిగింది. ఒక్కో పనస పండు రూ.200 నుంచి రూ.400 వరకు ధర పలికింది. దీంతో కొనుగోలు దారులు కాస్త వెనుకడుగు వేశారు. సీజన్ ప్రారంభం కావడంతో అరకొరగా సంతకు పండ్లు వచ్చాయి. దీంతో ఈ పండ్లకు గిరాకీ పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. దేవాపురం గిరిజన గ్రామాల నుంచి వచ్చే పనస పండ్లు రుచిగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. గతేడాది కంటే ముందుగానే ఈ ఏడాది పనస పండ్లు సంతలో కనువిందు చేశాయి.

డీఎంహెచ్‌వో తనిఖీ

ఎస్.రాయవరం : పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి బాలాజీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందులు ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలు, ల్యాబ్‌తో పాటు రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రికి గర్భిణులు ఎక్కువ శాతం వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

ప్రైవేట్ స్కూళ్లలో వసతులపై సమీక్ష



ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులతో ఎంఈవో జానుప్రసాద్, త్రిసభ్య కమిటీ సభ్యులు

రోలుగుంట: ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు అవసరమైన వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని యాజమాన్యాలకు మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ ఆదేశించారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో మండలంలోని ప్రైవేట్ స్కూళ్లపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, వసతులపై నివేదికలను ఎంఈవోకి అందించింది. ఈ మేరకు ఎంఈవో సోమవారం ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమీక్షించారు. నివేదిక ఆధారంగా జె.నాయుడుపాలెం, బుచ్చింపేట ప్రైవేట్ స్కూళ్లలో రన్నింగ్ వాటర్, పూర్తి స్థాయిలో బెంచీలు, బల్లలు తదితర వసతుల లేమిని గుర్తించి, త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించి, విద్యార్థులకు మేలైన విద్యను అందించేలా అర్హులైన ఉపాధ్యాయుల్ని నియమించాలని సూచించారు. సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంఈవో-2 జగ్గారావు, వెంకట్రావు. మోహన్, బుచ్చింపేట, కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం, రోలుగుంటలోని ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న కాసారపు సత్యనారాయణ

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ కాసారపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన అనకాపల్లి జోన్ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జోన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద కార్పొరేషన్‌గా పేరొందిన జీవీఎంసీలోని ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని, సీఎఫ్ఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు తెద్దు వెంకటేశ్వర్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు బంగారు రవి కుమార్, చిన్ని, అజయ్, నిమ్మకాయల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో గ్రాండ్ మాస్టర్ నూకరాజు, కోచ్‌లు ప్రసాద్, పుష్పారావు

పరవాడ: ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదపడుతుందని సీనియర్ గ్రాండ్ మాస్టర్ సారిపల్లి నూకరాజు అన్నారు. వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఆల్ కలర్ బెల్ట్ టెస్ట్ కరాటే పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. జాలరిపేట, సమ్మెంగపాలెం, మంగప్పయ్యగారిపూరు, కోరంగిపాలెం గ్రామాలకు చెందిన డ్రాగన్ లయన్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. కూండ్రపు దినేష్ బ్రౌన్ బెల్ట్, రోహిత్ గ్రీన్ బెల్ట్, కుసుమ, యశ్వంత్, రాధాకృష్ణ, జ్యోష్ణ, ఆదిత్యలు ఆరెంజ్ బెల్ట్‌లు సాధించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్‌లు ఓలిశెట్టి ప్రసాద్, గొర్లె పుష్పారావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న హోమంలో భక్తులు, పురోహితులు



వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం: మండల కేంద్రంలోని శ్రీవినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఇందిరమ్మ మోడల్ కాలనీలో ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయడంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. గతేడాది ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులచే హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో సందడి నెలకొంది. మధ్యాహ్నం ఆలయ భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం భజనలు, మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇంత వరకు కాలనీలో హిందూ ఆలయాలు లేవని, ఈ ఆలయ నిర్మాణంతో ఇందిరమ్మ కాలనీ ప్రజల్లో భక్తిభావం పెరిగిందని స్థానికులు ఆనందంగా చెబుతున్నారు.

మలేరియా నియంత్రణపై అవగాహన ర్యాలీ



మాడుగులలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

మాడుగుల రూరల్: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కె.జె.పురం పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు కోరారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మాడుగుల బస్టాండులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మలేరియా వ్యాధి వ్యాప్తి కారకాలు, నివారణ గురించి గ్రామాల్లో ఆరోగ్య, ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మురుగు కాలువల్లో నిల్వ నీరు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సహాయకులు శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవ సదస్సు సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి కల్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

వైద్యుల సలహాలు పాటించాలి



ఆదిరెడ్డిపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఎంవీ రమణ తదితరులు

సబ్బవరం: ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ ఎంవీ రమణ సూచించారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.గుల్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంవీ రమణ రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఉచితంగా మందులు అందించారు. పలు సూచనలు చేశారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఏఎన్ఎంలు,ఆశావర్కర్లతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవిద్య ప్రారంభ కోర్సు శిక్షణ



గురుమాత అన్నపూర్ణమ్మతో తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నిర్వహిస్తున్న శ్రీ విద్య ప్రారంభిక కోర్సు సోమవారంతో ముగిసింది.నాలుగు రోజు పాటు నిర్వహించిన ఈ తరగతులను గురుమాత అన్నపూర్ణమ్మ శ్రీవిద్యా ఉపాసన పాఠ్యాంశాలు నేర్చుకున్న విద్యార్థులను ఆశీర్వదించి జ్ఞాపికలు అందజేశారు. తెలుగు భాషలో నేర్పిన శ్రీ గురుమంత్ర దీక్ష,గణపతి చతురావృతి తర్పణ విధానం, ఆవరణార్చన,బాల తర్పణార్చన,చండీ నవార్ణవ మంత్రోపాసన సహిత దుర్గా సప్తశ్లోక పారాయణ విధి అనే అంశాలు విద్యార్థులకు నేర్పించారు. శిక్షణ తరగతులను శ్రీ విద్యా ఉపాసకులు కందర్ప రమ,షణ్ముఖ నిర్వహించారని గురుమాత తెలిపారు.